సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



గిరిజనులను ఆదుకోవాలి

వరద కారణంగా సర్వం కోల్పోయిన గిరిజనులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి డిమాండ్ చేశారు.

8లో



ఆతిథ్యం కరువు

చింతపల్లిలో తగిన వసతి సౌకర్యం లేక అధికారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇక్కడి అతిథి గృహాలు మూలకు చేరాయి.

9లో

ముగిసిన పవిత్రోత్సవాలు



డాబాగార్డెన్స్(విశాఖ) : కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిసాయి. దేవస్థాన వేద పండితులు, అర్చకుల పర్యవేక్షణలో పవిత్రోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

న్యూస్‌రీల్

పర్యాటక పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా 2023–24సంవత్సరానికి పురస్కారాలు అందజేయడానికి అర్హులైన అభ్యర్థులు, సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా పర్యాటకశాఖ అధికారి దాసు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యాటక రంగంలో సేవలు అందిస్తున్న వ్యక్తులు, సంస్థలకు ప్రతి ఏటా మాదిరిగా 38 విభాగాల్లో 41పురస్కారాలు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. ఏపీ టూరిజం వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఏపీ టూరిజం అథారిటీ, ఐదవ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేషన్ బిల్డింగ్, విజయవాడ అనే చిరునామాకు ఈ నెల 22వ తేదీలోగా పంపాలని ఆయన పేర్కొన్నారు.

దాతల సహకారంతో ఆలయాల జీర్ణోద్ధరణకు కృషి



అర్చకులకు పూజా సామగ్రి అందజేస్తున్న ప్రసాద్

కొయ్యూరు: దాతల సహకారంతో ఆలయాల జీర్ణోద్ధరణకు కృషి చేయనున్నట్టు ధార్మిక సంస్థల ప్రతినిధి డి.వి.డి.ప్రసాద్ తెలిపారు. రావణాపల్లి పంచాయతీ రేవడివీధిలో సోమవారం గిరిజన అర్చకులకు పూజా సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఆలయం పరిధిలో నగర సంకీర్తన,అన్నసమారాధన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. దేశ ఔన్నత్యాన్ని భావి తరాలకు తెలియసేజేసే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజవొమ్మంగి మండల బీజేపీ అధ్యక్షుడు టి.సూరిబాబు, ధార్మిక సెల్ జిల్లా కార్యదర్శి లోవరాజు,అర్చక సమైక్య కార్యదర్శి వనముల మల్లేష్,మండల బీజేపీ కన్వీనర్ మంగ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ నులి పురుగుల మాత్రలు

- ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

చింతూరు: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా చింతూరు డివిజన్‌లో 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరితో, కిశోర బాలలతో నులి పురుగుల మాత్రలు మింగించాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండాజోల్–400 మాత్రలు ఉచితంగా ఇస్తారని ఈ మాత్రలు ఎంతో సురక్షితమైనవని ఆయన తెలిపారు. నులి పురుగుల నుంచి రక్షణకు గోళ్లను చిన్నవిగా, శుభ్రంగా ఉంచుకోవాలని, ఎల్లప్పుడూ శుభ్రమైన నీటిని తాగాలను ఆయన సూచించారు. చింతూరు డివిజన్‌లో 31,320 మంది పిల్లలతో మంగళ వారం తప్పనిసరిగా నులి పురుగుల మాత్రలు మింగించాలని పీవో ఆదేశించారు.

నేడే అనంతుని జయంతి



అనంతుని ఉత్సవ విగ్రహాలు

పద్మనాభం(విశాఖ): పద్మనాభంలోని కుంతీ మాధవస్వామి ఆలయంలో మంగళవారం జరగనున్న అనంతుని జయంతికి భక్త బృందం సభ్యులు, ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీదేవి, భూదేవి, అనంతుని ఉత్సవ విగ్రహాలకు నూతన వస్త్రాలను సమకూర్చారు. ఆలయ బోగం, ముఖ ద్వారం, బేడా మండపాన్ని మామిడి, అరటి తోరణాలతో సుందరంగా అలకంరించారు. గతంలో బేడా మండపంలో అనంతుని వ్రతా లు నిర్వహించేవారు. ఈ సారి కల్యాణ వేదిక వద్ద వ్రతాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. భక్తులు వ్రతాలు నిర్వహించుకోవడానికి టింట్లు ఏర్పాటు చేశారు. వ్రతాలు ఉదయం 7.30 గంటలకు ప్రారంభమవుతాయి.

కల చెదిరింది..



బుచ్చెయ్యపేట: మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేస్తే మాలాంటి సామాన్య, మధ్యతరగతి ప్రజల పిల్లలు డాక్టర్ అవ్వాలన్న కల చెదిరిపోతుంది. కొత్త మెడికల్ కాలేజీలు వస్తాయన్న నమ్మకంతో నా కుమారుడిని ఇంటర్ బైపీసీ చదివిస్తున్నాను. చంద్రబాబు సర్కారు నిర్దయగా వ్యవహరించడంతో పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న ఆందోళన మొదలైంది.వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందన్న భయంతో నిర్మాణంలో ఉన్న కాలేజీలను అర్ధంతరంగా ఆపేస్తే.. వచ్చే చెడ్డపేరు ఇప్పటి ప్రభుత్వం భరించాలి కదా. – **పల్లా లోవ**, విద్యార్థి తల్లి, బుదిరెడ్లపాలెం



వైద్య విద్య అందనంత దూరం



అనకాపల్లి :కొత్త మెడికల్ కళాశాలలను ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే కూటమి ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలి. రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలు, దళిత, గిరిజన విద్యార్థులకు తీరని అన్యాయం చేసే నిర్ణయమిది. రాష్ట్రంలో నిర్మాణదశలో ఉన్న అన్ని మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలి. ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూరాలని చూస్తే ప్రభుత్వం సంక్షేమ పాలన నుంచి తప్పుకున్నట్టు భావించాల్సి వస్తుంది. విద్యను వ్యాపారం చేయడం వల్ల అన్ని వర్గాల ప్రజలు అప్పుల పాలవుతారు. – **బొట్టా చిన్నయాదవ్**, ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు, అనకాపల్లి

పసుపు రైతు దిగాలు

ధర భారీగా పతనం

పసుపు ధర తగ్గిపోవడంతో జిల్లాలో పసుపు పంటను సాగు చేస్తున్న గిరిజన రైతులు గగ్గోలు పెడుతున్నారు. తాము భారీగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మే నెల వరకు కిలో రూ.150 ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు ఒక్కసారిగా ధరను రూ.30 తగ్గించి, రూ.120కి కొనుగోలు చేస్తున్నారు. దరసరా ముందు సాధారణంగా ధర బాగా పెరుగుతుంది. అదే ఆశతో రైతులు, చిన్న వ్యాపారులు పంటను నిల్వ ఉంచారు. ధర తగ్గిపోవడంతో దిగాలు చెందుతున్నారు. మరింత తగ్గిపోతుందన్న భయంతో విక్రయాలు జరుపుతున్నారు.



- ప్రస్తుతం రూ.30 తగ్గించి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- దసరాకు ధర పెరుగుతుందన్న ఆశతో నిల్వ ఉంచి నష్టపోయిన రైతులు
- మరింత తగ్గుతుందనే భయంతో అమ్మకాల జోరు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో పసుపు ధరలు పతనమయ్యాయి. దీంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. దసరా ముందు నెలల్లో అధిక ధరలు లభిస్తాయి, ఆ సమయంలో అమ్ముకుందామనుకున్న పసుపు రైతులకు నిరాశే మిగిలింది. ఈఏడాది జనవరి నుంచి మే నెల వరకు పసుపు అమ్మకాల సీజన్‌లో రైతులకు మంచి లాభాలు వచ్చాయి. గతంలో ఎన్నడూలేని విధంగా కిలో రూ.120 ధరతో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మేనెలలో కిలో ధర రూ.150వరకు పెరిగింది. పాడేరు డివిజన్‌లోని 22వేల ఎకరాల్లో పసుపు సాగుచేసిన గిరిజన రైతులు అధిక ఆదాయం పొందారు.ఎకరానికి వేయి టన్నుల వరకు ఎండిన పసుపును గిరిజన రైతులు ప్రతి ఏడాది విక్రయిస్తారు. అయితే మే నెల తరువాత పసుపు కొనుగోళ్లను వ్యాపారులు నిలిపివేస్తారు. దీంతో ఆ పసుపును నిల్వ చేసుకుని దసరాకు ముందు నెలల్లో అధిక ధరలకు అమ్మకాలు జరపడం పూర్వం నుంచి ఆనవాయితీ. ఈ తరహాలోనే పాడేరు డివిజన్ వ్యాప్తంగా అన్ని మండలాల్లోను పసుపు రైతులతో పాటు చిన్న వ్యాపారులు సుమారు 30శాతం వరకు పసుపును నిల్వ చేశారు.



జి.మాడుగుల నుంచి వి.మాడుగులకు తరలిస్తున్న పసుపు బస్తాలు

రైతులకు భారీ నష్టం

దసరా ముందు నెల కావడంతో గత వారం నుంచి నిల్వ పసుపును అమ్మకాలు జరుపుతున్న గిరిజన రైతులకు భారీ నష్టం ఏర్పడింది. కిలో రూ.120తో వారపుసంతలతో పాటు గ్రామాలలోను వ్యాపారులు పసుపును కొనుగోలు చేస్తున్నారు.మే నెలలో కిలో రూ.150 ధర పలకగా,దసరా ముందు పసుపునకు డిమాండ్ ఏర్పడి కనీసం కిలో రూ.180వరకు ధర వస్తుందని గిరిజన రైతులు,చిన్న వ్యాపారులు ఆశపడ్డారు.ఇన్నాళ్లు పసుపును నిల్వ ఉంచుకుని ఇప్పుడు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి రావడంతో వారంతా ఉసూరుమంటున్నారు. కర్ణాటక,తమిళనాడు రాష్ట్రాల్లో పసుపునకు డిమాండ్ తగ్గిందని, వి.మాడుగులలోని పెద్ద వ్యాపారుల వద్ద పసుపు నిల్వలు భారీగా పేరుకుపోయాయనే ప్రచారం గిరిజన రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. దసరా సమయానికి పసుపు ధర మరింత తగ్గుతుందనే ప్రచారంతో తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. వ్యాపారులు ఏజెన్సీలో కొనుగోలు చేస్తున్న పసుపును వి.మాడుగులలోని గిడ్డంగిలకు వ్యాన్‌ల ద్వారా తరలిస్తున్నారు.

తగ్గింపు దారుణం



దసరాకు నెల ముందు ఏటా మన్యం పసుపునకు డిమాండ్ ఉంటుంది. మంచి ధర లభిస్తుందని ఆశించిన రైతులకు ఇప్పుడు నిరాశే మిగిలింది. ధర పెంచి పెద్ద వ్యాపారులు కొంటారనుకున్నాం. కానీ దానికి భిన్నంగా కిలోకు రూ.30 తగ్గించి కొనుగోలు చేయడం దారుణం.ఆర్థికంగా రైతులమంతా ఇబ్బంది పడుతున్నాం.

– కొర్రా నారాయణ, పసుపు రైతు, బొండాపల్లి,పెదబయలు మండలం

ధర తగ్గుతుందనే భయంతో..



ఎకరం పసుపు పంటలో 900 కిలోల వరకు ఎండు పసుపు దిగుబడికి వచ్చింది. కిలో రూ.150 ధరతో మే నెలలో 700 కిలోలు విక్రయించాను. దసరా నెలలో డిమాండ్ ఉంటుందని ఆశపడి మిగిలిన పసుపును నిల్వ ఉంచాను.పెదబయలు సంతలో కిలో రూ.120తో వ్యాపా రులు కొనుగోలు చేస్తుండడంతో నష్టం ఏర్పడింది.ముమ్ముందు ధర తగ్గుతుందనే భయంతో తక్కువ ధరకే అమ్ముకుంటున్నాం.

–మల్లెల కర్రన్న, పసుపు రైతు, సీతగుంట, పెదబయలు మండలం

19న గవర్నర్ విశాఖ రాక

మహారాణిపేట(విశాఖ): రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈనెల 19న విశాఖ రానున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో గురువారం మధ్యాహ్నం 3.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా నొవోటెల్ హోటల్‌కు వెళ్లి అక్కడ బస చేస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు ఏయూ మెరైన్ విభాగంలో జరిగే దివ్య కళా మేళాలో పాల్గొంటారు. అనంతరం నొవోటెల్ హోటల్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. 20న సాయంత్రం 6.55 గంటలకు విమానంలో విజయవాడ బయలుదేరుతారు.

యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మతు పనులు

- పీఆర్‌డీఈ కల్యాణ్‌కుమార్



పనులను పరిశీలిస్తున్న డీఈ కల్యాణ్ కుమార్

సీలేరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమైన రోడ్ల మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్టు పీఆర్ డీఈ కల్యాణ్‌కుమార్ చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అటువంటి రోడ్లను ఇప్పటికే సర్వే చేశామని తెలిపారు. గూడెం కొత్తవీధి మండలం గాలికొండ రోడ్డులో 8 కిలోమీటర్లు, దారకొండ–గుమ్మిరేవుల మధ్యలో చోడిరాయి, మాదిగమల్లు అప్రోచ్ రోడ్ల మరమ్మతు పనులను సోమవారం చేపట్టారు. ఆ పనులను పరిశీలించిన అనంతరం డీఈ మాట్లాడారు. మారుమూల అన్ని పంచాయతీల్లో రోడ్ల పనులను త్వరగా పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, సర్పంచ్ రాజు, ఉపసర్పంచ్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

బై బై గణేశా



ముంచంగిపుట్టులో వినాయక నిమజ్జనోత్సవంలో యువత సందడి

- వైభవంగా నిమజ్జనోత్సవాలు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గణేశ్ నిమజ్జన వేడుకలు సోమవారం కన్నుల పండువగా జరిగాయి. తొమ్మిది రోజులు పూజలందుకున్న గణనాథుని విగ్రహాలను భారీ ఊరేగింపు నడుమ తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. థింసా నృత్యాలు, కోలాటాలతో మహిళలు, యువత ఉత్సాహంగా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. – 8లో



పాడేరులో నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకు వెళుతున్న గణేశ్ విగ్రహం

ఘనంగా మిలాద్–ఉన్–నబీ వేడుకలు



పాడేరు పట్టణంలో ముస్లింల ర్యాలీ

సాక్షి, పాడేరు: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మిలాద్–ఉన్–నబీ పర్వదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. వేడుకలో భాగంగా జిల్లా కేంద్రం పాడేరులో ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిక్రే–ఇలామీ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాడేరు మెయిన్‌రోడ్డులో మానవహారం నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. మసీదు గురువు మహ్మద్ అలీ మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త బోధనలు మానవాళికి ఆచరణీయమన్నారు. ప్రవక్త సూచించిన శాంతి, ప్రేమ, ఐకమత్యం, సోదరభావం తదితర సద్గుణాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని కోరారు. మత పెద్దలు అబ్దుల్లా మహమ్మద్, సులేమాన్, ఇక్బాల్ మస్తాన్, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.



జోలాపుట్టులో కేక్ కట్ చేస్తున్న ముస్లింలు

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలోని మసీదులో మిలాద్–ఉన్–నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మసీదు ఆవరణలో జరిగిన వేడుకలో ముస్లింలు కేక్ కట్ చేశారు. జాకీర్ హుస్సేన్, సోలెమాన్, రాజ్ సిలర్ తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞశాలి సీతారాం ఏచూరి

పాడేరు: మార్క్సిస్టు యోధుడు సీతారాం ఏచూరి బహుముఖ ప్రజ్ఞాశాలని, జనం హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సీపీఎం జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్స అన్నారు. స్థానిక పీఎంఆర్సీ భవనంలో సోమవారం నిర్వహించిన ఏచూరి సీతారాం సంతాప సభలో ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి ఎస్.సుందరరావు అధ్యక్షతన జరిగిన సభలో అప్పలనర్స మాట్లాడుతూ ఏచూరి నిరంతరం ప్రజా సమస్యలపై పోరు సాగిస్తూ పాలకుల వైఫల్యాలను ఎండగట్టి దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషించారన్నారు. బీజేపీ మతతత్వ విధానాలను వ్యతిరేకించి, మత రాజకీయాలు దేశ అభ్యున్నతికి ఎంత ప్రమాదకరమో ఏచూరి అందరికీ వివరించారని చెప్పారు. ప్రపంచ బ్యాంకు ఒప్పందాలను వ్యతిరేకించి పోరు సాగించారని తెలిపారు.



సంతాప సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

విశాఖను వదలం


- ఏజెన్సీకి వెళ్లలేం
- ప్రజాప్రతినిధుల సిఫార్సుల కోసం తహసీల్దార్లు, ఎంపీడీవోలు పైరవీలు
- ఏళ్ల నుంచి మన్యంలో పనిచేస్తున్న వారికి అన్యాయం
- నిబంధనలకు అనుగుణంగా బదిలీలు చేయాలని వినతి

'ఏజెన్సీలో చాలా ఏళ్ల నుంచి పనిచేస్తున్నాం..మాకు కూడా మైదాన ప్రాంతాల్లో పనిచేయాలని ఉంటుంది..ప్రభుత్వ జీవో ప్రకారం బదిలీలు జరుగుతాయని ఎదురుచూస్తున్నాం ..కానీ ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫారసు లేఖలకు ప్రాధాన్యం ఇస్తారని ఊహించలేదు. మా వినతులను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వ జీవో ప్రకారం నిష్పక్షపాతంగా బదిలీలు జరపాలి' అని అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లు, ఎంపీడీవోలు కోరుతున్నారు. సిఫార్సు లేఖలు పెద్ద సంఖ్యలో రావడంతో ఇప్పుడు తమ పరిస్థితి అయోమయంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. – మహారాణిపేట (విశాఖ)

వివిధ ప్రభుత్వ శాఖల్లో కొంతమంది అధికారులు సర్వీసులో చేరిన నాటి నుంచి పదవీ విరమణ అయ్యే వరకు విశాఖలోనే ఉండాలని కోరుకుంటున్నారు. దీని కోసం ఎలాంటి పైరవీలకైనా సిద్ధపడుతున్నారు. తమ పరిచయాలు వినియోగించుకుంటున్నారు. అధికారపార్టీ నేతల నుంచి ఫోన్లు, సిఫార్సు లేఖలతో తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మరికొందరు అధికారులు తమ కుర్చీ కదలకుండా ఉండేందుకు బేరసారాలకూ దిగుతున్నారు. దీంతో కొంతమంది అధికారులను విశాఖనుంచి కదపడానికి సాహసించలేకపోతున్నారు. ఇలాంటి వారి జోలికి వెళితే తమకే ఇబ్బందులు ఎదురవుతాయని మిన్నకుండిపోతున్నారు. అర్హులకు అన్యాయం చేస్తున్నారు. ఇలాంటి రికమండేషన్ ఉద్యోగులు ఎక్కువగా రెవెన్యూశాఖ, పంచాయతీరాజ్ శాఖలో ఎంపీడీవోలు, ఇంజినీర్లు, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఉద్యోగులున్నారు.

మన్యమంటే ముఖం చాటేస్తున్నారు

ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రంగా బదిలీలు జరుగుతున్నాయి. ఏజెన్సీలో ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలని దరఖాస్తులు చేసుకున్నారు. ఉదాహరణకు ఏజెన్సీ నుంచి ముగ్గురు తహసీల్దార్లను విశాఖకు పంపితే, విశాఖ నుంచి ముగ్గురు తహసీల్దార్లను తిరిగి ఏజెన్సీకి పంపాల్సి ఉంటుంది. అక్కడ నుంచి విశాఖకు రావడానికి చాలా మంది ఆసక్తిగా దరఖాస్తు చేసుకున్నారు. కానీ విశాఖ నుంచి ఏజెన్సీకి వెళ్లడానికి ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. దీంతో బదిలీల వ్యవహారం ఉన్నతాధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది.



టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఓటరుగా చేరండి

మహారాణిపేట(విశాఖ): రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ముగిసి మూడు నెలలు గడిచింది. ఇప్పుడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుత ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటితో పూర్తవుతుంది. నిర్ణీత సమయంలో ఎన్నికలు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓటు నమోదు ప్రక్రియకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించి ఈ నెల 30న నోటిఫికేషన్ జారీ చేస్తారు. నవంబర్ 6 వరకు ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. నవంబర్ 23న ఓటర్ల నమోదుపై డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేస్తారు. దీనిపై నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు పాత ఓటర్ల జాబితాను పరిగణలోనికి తీసుకోరు. కొత్తగా ఓటు హక్కుకు అర్హులైన వారితో పాటు గతంలో ఓటు హక్కు ఉన్నవారు కూడా మరలా నమోదు కావాల్సి ఉంటుంది. ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఫారం 19 ద్వారా ఓటు హక్కును పొందాల్సి ఉంటుంది. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన సెకండరీ పాఠశాల, ఆపై సంస్థల్లో పని చేస్తూ నవంబర్ ఒకటో తేది నాటికి గత ఆరేళ్లలో మూడేళ్ల సర్వీసు నిండిన వారు అర్హులు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు లేకపోయినా అర్హత కలిగి ఉంటే ఈ ఎన్నికల్లో ఓటరుగా నమోదు కావచ్చు. ఫారం–19తోపాటు ఫొటో, సర్వీస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు(ఆప్షనల్), ఓటర్ ఐడీ కార్డు/నివాస ధ్రువీకరణపత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేసి రసీదు పొందవచ్చు.

క్లుప్తంగా

గిరిజనులను ఆదుకోవాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ

సీలేరు: గతంలో ఎన్నడూ లేనంతగా వచ్చిన వరద కారణంగా సర్వం కోల్పోయిన గిరిజనులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సత్యనారాయణ డిమాండ్‌ చేశారు. గూడెం కొత్తవీధి మండలంలోని పలు వరద ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లోకి వరదనీరు చేరడంతో తీవ్ర నష్టం కలిగిందని చెప్పారు. ఈ సందర్భంగా ఏపీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు విమల, సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మూడు క్వింటాళ్ల బియ్యం, ఇతర నిత్యావసర సరకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు. ధారకొండ వర్తక సంఘం సభ్యులు ధారాపురంలోని 21 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు, దార్లగొందిలో 25 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు, గుమ్మిలేరు పంచాయతీలో రెండు కుటుంబాలకు 50 కిలోల బియ్యం, రూ.4,500 నగదు అందజేశారు. సీలేరుకు చెందిన ఏపీ జెన్‌కో ఉద్యోగి వరప్రసాద్‌, పోస్టుమాస్టర్‌ ప్రసాదరావు, కళాశాల లెక్చరర్‌ ఎ.సాయిరామ్‌ జొన్నమామిడి, దాలికొండ గ్రామాలకు నిత్యవసర సరుకులు అందజేశారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు


భీమరాజు (ఫైల్‌)

చింతపల్లి: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల-2లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి కించె భీమరాజు అదృశ్యమయ్యాడు. విద్యార్థి తండ్రి సీతన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చింతపల్లి ఎస్సై అరుణ్‌కిరణ్‌ సోమ వారం తెలిపారు. గత నెల 24న పాఠశాల నుంచి అనారోగ్యం కారణంగా చూపి విద్యార్థి తన ఇంటికి వెళ్లాడన్నారు. ఈ నెల 10న మళ్లీ తిరిగి పాఠశాలకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరినట్టు విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారన్నారు. అటు పాఠశాలకు రాక, ఇటు ఇంటి దగ్గర లేకపోవడంతో విద్యార్థి తండ్రి ఫిర్యాదు చేశాడన్నారు. కేసు విచారణ చేపడుతున్నామని ఎస్సై తెలిపారు.

గురుకుల విద్యార్థికి మెడిసిన్‌ సీట్‌


గోపాలరావు

మధురవాడ(విశాఖ): విశాఖ మారికవలసలోని ఏపీ గిరిజన గురుకుల శిక్షణ సంస్థ విద్యార్థి జి.గోపాలరావు మెడిసిన్‌లో సీటు సాధించాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ట్రెనింగ్‌ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల్లో 28 మంది నీట్‌-2024కు హాజరు కాగా.. వారిలో గోపాలరావు 482 మార్కులు సాధించాడు. ఎస్టీ కేటగిరిలో ఆలిండియా స్థాయిలో 3,658వ ర్యాంకు సాధించి మధురవాడ గాయత్రి మెడికల్‌ కళాశాలలో మెడిసిన్‌లో సీటు పొందాడు. హుకుంపేట మండలం ఈదురు గరువు గ్రామానికి చెందిన ప్రసాదరావు, లక్ష్మిల కుమారుడైన గోపాలరావు సాధారణ వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి వచ్చి కార్డియాజిస్ట్‌ కావాలనే లక్ష్యంతో కష్టపడి చదివి సీటు సాధించాడు. చింతపల్లి మండలం పాత కిన్నెర్ల గ్రామంలోని ఆదిమ గిరిజన తెగకు చెందిన వ్యవసాయ కూలీలు పి.బంగార్రాజు, నీల్మల కుమారుడు పి.మత్యరాజు నీట్‌లో 384 మార్కులు సాధించి ఎస్టీ కేటగిరీలో ఆలిండియా స్థాయిలో 10,859వ ర్యాంకు సాధించాడు. వెటర్నరీ, బీడీఎస్‌ల్లో సీటు సాధించే అవకాశాలు ఉన్నాయని ప్రిన్సిపాల్‌ శివప్రసాద్‌ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విజేతలను ప్రిన్సిపాల్‌, ఉపాధ్యాయులు అభినందించారు.


బెన్నవరంలో వినాయకుని లడ్డూ వేలంపాటలో భక్తులు


జి.మాడుగులలోని వినాయకుని ఊరేగింపు వేడుకలో పాల్గొన్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు


జి.మాడుగులలో గణనాథుని ఊరేగింపు

ఘనంగా గణనాథుని నిమజ్జనం


చింతపల్లిలో గణేష్‌ ఊరేగింపులో థింసా నృత్యాలు చేస్తున్న యువత


పాడేరులో గణేష్‌ విగ్రహాల ఊరేగింపు


అడ్డతీగలలో గణనాథుని ఊరేగింపులో భక్తులు

- గణేష్‌ విగ్రహాల ఊరేగింపులో హోరెత్తిన నృత్యాలు
- యువత, చిన్నారుల సందడి
- తరలివచ్చిన గ్రామస్తులు

సాక్షి,పాడేరు: వినాయకచవితి పండగ నుంచి పూజలందుకుంటున్న గణపతి విగ్రహాల నిమజ్జన కార్యక్రమం సోమవారం కూడా ఘనంగా నిర్వహించారు. పాడేరు పట్టణ పరిధిలోని సుండ్రుపుట్టు, ఇతర వీధుల్లో కొలువుదీరిన గణనాథుని విగ్రహాలను పాడేరు పురవీధుల్లో ఊరేగించారు. తీన్‌మార్‌ డప్పులు, ఒడియా బ్యాండ్‌ శబ్దాల మధ్య గిరిజన యువతీ, యువకులు, చిన్నారులు డ్యాన్స్‌లతో హోరెత్తించారు. థింసా నృత్యాలతో మరింత సందడి నెలకొంది. రాత్రి వరకు గణపతి విగ్రహాలను ఊరేగించిన అనంతరం చిలకలమామిడి, హుకుంపేట గెడ్డలలో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంతోపాటు ఏనుగురాయి పంచాయతీ జంగంసరియా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లడ్డు వేలంపాట నిర్వహించారు. ముంచంగిపుట్టులో లడ్డును రూ.25,601లకు సుజనకోట ఎంపీటీసీ మజ్జి సుబ్బులక్ష్మీ, దామోదరం దంపతులు వేలంలో దక్కించుకున్నారు. జంగంసరియాలో లడ్డును రూ.26వేలకు సుజనకోట సేల్స్‌మెన్‌ శ్రావణ్‌ దక్కించుకున్నారు.అనంతరం సుజనకోట మత్స్యగెడ్డ ఒడున విగ్రహాలను నిమజ్జనం చేశారు.

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో గణేష్‌ నిమజ్జనం వైభవంగా జరిగింది. విగ్రహాల ఊరేగింపులో చిన్నారులు, యువత సందడి చేశారు.

సీలేరు: సీలేరులోని అల్లూరి వీధి, శివాలయం వీధి, వర్తక సంఘం, దుర్గావీధి తదితర ప్రాంతాల్లో కొలువైన వినాయక విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. అన్నదానంతోపాటు లడ్డూ వేలంపాటలు కూడా నిర్వహించారు.

చింతపల్లి: మండలంలోని జీసీసీ డిపోతోపాటు, ఎస్సీకాలనీతోపాటు గొందిపాకలు, బెన్నవరం గ్రామాల్లో గణనాథుని నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. మండపాల వద్ద లడ్డూ వేలంపాటతో పాటు, థింసానృత్యాలు, కోలాటాల ప్రదర్శనలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

జి.మాడుగుల: గ్రామాల్లో పండుగల వల్ల ప్రజల్లో భక్తిభావం మరింత పెంపొందుతుందని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలో జి.మాడుగుల పంచాయతీ గాంధీనగర్‌ గ్రామంలో సోమవారం జరిగిన వినాయకుని నిమజ్జనం కార్యక్రమానికి విచ్చేశారు. ముందుగా గణేష్‌నికి భక్తిశ్రద్ధలతో ఆయన పూజలు నిర్వహించారు. గణేష్‌ను నిమజ్జనం ఊరేగింపులో ప్రజలంతా భక్తిభావంతో నడుచుకోవాలని ఆయన సూచించారు. గ్రామంలో అందరు కలసికట్టుగా ఉండి, ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని కోరారు. జి.మాడుగుల పురవీధుల్లో గణేష్‌ని ఊరేగింపు డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ఘనంగా ఉత్సవ కమిటీ నిర్వహించింది. ఈదులబయలు గ్రామం వద్ద గల గెడ్డలో వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.


సీలేరులో వినాయక విగ్రహం ఊరేగింపు

అడ్డతీగల: అడ్డతీగల గ్రామమంతా ఊరేగింపు నిర్వహించి మద్దిగడ్డ జలాశయంలో నిమజ్జనోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. ఒక్క అడ్డతీగలలోనే కాకుండా అడ్డతీగలకు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు గంగవరం మండలంలోని పలు గ్రామాల నుంచి గణనాథుల విగ్రహాలతో భక్తులు ఊరేగింపుగా వచ్చి ఈ నిమజ్జనోత్సవాలను జరిపారు.అడ్డతీగలలోని లక్ష్మీగణపతి మోటార్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో 27 కిలోలు, 25 కిలోల భారీ లడ్డూలకు పూజలు అనంతరం భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ప్రసన్న విఘ్నేశ్వరస్వామి ఆలయ కమిటీ, విఘ్నేశ్వర యూత్‌ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

రాజవొమ్మంగి: అప్పలరాజుపేటలో ఏర్పాటు చేసిన గణనాథుడుని ఊరేగించి, వట్టిగెడ్డ జలాశయంలో నిమజ్జనం చేశారు. రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏడు చోట్ల వినాయక నిమజ్జనం జరిగిందని, ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్‌ఐలు వెంకయ్య, విజయ్‌కుమార్‌ తెలిపారు.


గూడెంకొత్తవీధిలోని గణేశుని విగ్రహం ఊరేగింపులో భక్తులు

ఎటపాక: మండలంలోని నందిగామ, గౌరిదేవిపేట, తోటపల్లి,సీతాపురం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఊరేగించి, పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో మేళతాలాలు, డీజే సౌండ్స్‌తో చిన్నారులు, పెద్దలు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. నందిగామలో ప్రముఖ న్యాయవాది సీహెచ్‌.యాదయ్య ఎం.ఎస్‌. స్ఫూర్తి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. తానికొండ వాసు, గొడపర్తి చిననాగయ్య, ముక్తేశ్వరరావు, వంశీ, నాగేశ్వరరావు, భాస్కరరావు, కొండయ్య, సీతయ్య తదితరులు పర్యవేక్షించారు.


రాజవొమ్మంగిలో గణేష్‌ విగ్రహం ఊరేగింపులో భక్తులు


నందిగామలోని అన్నసమారాధనలో భక్తులు

తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

- నోట్ల కట్టలకు అమ్ముడు పోయే మనస్తత్వం పాడేరు ఎమ్మెల్యేకు లేదు
- గిరిజనులను దోపిడీ చేయాలని చూస్తే ఊరుకోం
- చింతపల్లి ఏఎంసీ మాజీ ఛైర్‌పర్సన్‌ రాజులమ్మ



కొయ్యూరు: పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వేశ్వరరాజుపై ఎవరైనా తప్పుడు ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని చింతపల్లి మార్కెట్‌ కమిటీ మాజీ ఛైర్‌పర్సన్‌, పార్టీ మండల మహిళా విభాగ నాయకురాలు జి.రాజులమ్మ హెచ్చరించారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ నోట్ల కట్టలకు అమ్ముడుపోయే మనస్తత్వం పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వేశ్వరరాజుది కాదని స్పష్టం చేశారు. కూటమి నాయకులు చెప్పే మాటల ఎవరు వినే స్థితిలో లేరన్నారు. 2014లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన గిడ్డి ఈశ్వరి తరువాత పార్టీ మారారని, అలాంటి వారికి తొత్తులుగా ఉన్న కొందరు విశ్వేశ్వరరాజుపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. నోట్ల కట్టలకు అమ్ముడై పార్టీలు మారిన వారు నీతి కబుర్లు చెప్పడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. బినామీలను అడ్డం పెట్టుకుని అమాయక గిరిజనులను దోపిడీ చేయాలని చూస్తున్న వారి ఆటలు సాగవన్నారు. అధికారులను గుప్పెట్లో పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించాలని చూస్తే తగిన విధంగా స్పందిస్తామని చెప్పారు. పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు గెలిచినప్పటి నుంచి నిత్యం ప్రజల మధ్య ఉంటూ, సమస్యలు పరిష్కరిస్తూ, గిరిజనుల మన్ననలు పొందడం కూటమి నాయకులకు రుచించడం లేదన్నారు. ఈ కారణంగా వారంతా అందోళన చెందుతూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇకపై పాడేరు ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఆమె హెచ్చరించారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో రెండు వాహనాలు దగ్ధం


దుక్కవానిపాలెంలోని వాహనంలో చెలరేగిన మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తగరపువలస: ఆనందపురం మండలంలో షార్ట్‌సర్క్యూట్‌ కారణంగా రెండు వేర్వేరు సంఘటనలలో బొలేరా వాహనంతో పాటు పల్సర్‌ బైక్‌ దగ్ధమయ్యాయి. భీమిలి మండలం తాళ్లవలస అగ్నిమాపకకేంద్రం అధికారి జి.శ్రీనివాసరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ నుంచి నవీన్‌ అనే వ్యక్తి పల్సర్‌ ద్విచక్రవాహనంపై విజయనగరం జిల్లా సాలూరు వెళ్తూ ఆనందపురం సమీపంలో పెట్రోల్‌ వేయించాడు.
అనంతరం బయలుదేరిన కొద్ది సేపటికే వేములవలస ఫ్లై ఓవర్‌ కిందకు చేరేసరికి వాహనం నుంచి మంటలు చెలరేగాయి. క్షణాలలోనే వాహనం మొత్తం దగ్ధమైంది. అదే విధంగా బోయిపాలెం పంచాయతీ దుక్కవానిపాలెంలో ఆనంద్‌కు చెందిన బొలేరా వాహనం కూడా దగ్ధమైంది. షార్ట్‌సర్క్యూట్‌ కారణంగానే ఈ ప్రమాదాలు చోటుచేసుకున్నాయని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. రెండు ప్రమాదాల్లో రూ.4లక్షలు ఆస్తి నష్టం జరిగిందని నిర్ధారించారు.

యువతి ప్రేమించలేదని అసోం యువకుడి ఆత్మహత్య

- రహదారి పనులు చేసేందుకు వచ్చిన హుస్సేన్‌


హుస్సేన్‌ మృతదేహం

కొయ్యూరు: తన ప్రేమకు యువతి అంగీకరించలేదన్న మనస్తాపంతో అసోంకు చెందిన నజిబుల్‌ హుస్సేన్‌ (18) జీడి చెట్టుకు ఉరేసుకుని ఆదివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతదేహాన్ని బట్టపనుకుల జీడితోటలో సోమవారం పోలీసులు గుర్తించారు. జాతీయ రహదారి -516ఈ పనులు చేసేందుకు హుస్సేన్‌ అసోం నుంచి మే నెలలో ఇక్కడకు వచ్చాడని ఎస్‌ఐ రామకృష్ణ సోమవారం తెలిపారు. ఇక్కడ పనులు చేస్తున్న అతను మరో ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమించాడన్నారు. ఆమె అంగీకారం తెలపకపోవడంతో మనస్తాపం చెంది బట్టపనుకులలో జీడితోట వద్ద ఉరేసుకుని మరణించాడని తెలిపారు. స్థానికుల నుంచి సమాచారం రావడంతో పంచనామా అనంతరం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించామన్నారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని తెలిపారు.

జీవో నంబర్‌-3కు చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

పాడేరు: జీవో నంబర్‌-3కు చట్టబద్ధత కల్పిస్తూ, ఆదివాసీ స్పెషల్‌ డీఎస్సీ నోటిఫికేషన్‌ విడుదల చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా నాయకుడు పాలికి లక్కు డిమాండ్‌ చేశారు. పాడేరులో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 18న జరిగే కేబినెట్‌ సమావేశంలో ఆర్డినెన్స్‌ తీసుకురావాలని కోరారు. జీవో నంబర్‌3పై ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేర్చాలన్నారు. గిరిజన సలహా మండలిని తక్షణమే ఏర్పాటు చేయాలని, ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్‌ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకువాలని వారు డిమాండ్‌ చేశారు.

జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజుకు తీవ్ర అస్వస్థత


నూకరాజు

కొయ్యూరు: కొయ్యూరు జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు తీవ్ర అస్వస్థతతో నర్సీపట్నంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు డెంగ్యూ లక్షణాలున్నట్టు ఇక్కడ వైద్యులు నిర్ధారించారు. కొద్ది రోజులుగా ఆయన అనార్యో గం కారణంగా నర్సీపట్నంలోని సంజీవిని ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. అయితే ఆరోగ్యం విషమించడంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు ఈ సందర్భంగా డౌనూరు ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు మాట్లాడుతూ గడచిన కొన్ని రోజుల నుంచి నూకరాజుకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో నర్సీపట్నంలో జాయిన్‌ చేశామన్నారు. అక్కడ చికిత్స పొందుతున్న అతనికి సోమవారం సీరియస్‌ కావడంతో వెంటనే విశాఖాకు తరలించామన్నారు.ఆయనకు షుగర్‌ కూడా ఉందని చెప్పారు. ఆయన త్వరగా కోలుకోవాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

మహారాణిపేట(విశాఖ) : ప్రకృతి వ్యవసాయంపై సోమ వారం నగరంలోని ఓ హోటల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మేఘాలయ రాష్ట్రం నుంచి అనేక మంది వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సాధికార సంస్థ, ఎంఎస్‌ మాక్స్‌ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంకేతిక సహాయం, ప్రకృతి వ్యవసాయం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించారు. వ్యవసాయ శాఖ రీజినల్‌ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌ వి.కృష్ణారావు, ఎం.ఎస్‌.మాక్స్‌ సీఈవో పి.గంగరాజు, ఎం.కామరాజు, తరుణ్‌ ఆదిత్య, హేమలత, టి.లక్ష్మణరావు, రిసోర్స్‌పర్సన్స్‌ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


మత్స్యపురంలో రచ్చబండ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: గిరిజన గ్రామాలభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని మత్స్యపురం పంచాయతీ కేంద్రంలో ఆయన సోమవారం పర్యటించారు. ఇందులో భాగంగా జిల్లా పరిషత్‌ నిధులు రూ.2లక్షల వ్యయంతో గ్రామంలో చేపట్టనున్న రచ్చబండ నిర్మాణానికి ఆయన స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తానన్నారు.

గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా తనను నేరుగా తెలియజేయాలని కోరారు. అనంతరం కొట్నాపల్లి పంచాయతీ బిసాయిపుట్టును సందర్శించారు. ముందుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికు రోడ్డు సమస్యను తెలియజేయగా, ఎమ్మెల్యే మత్స్యలింగం తక్షణమే స్పందించి, సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్‌లు కాకరి బొంజుబాబు, పూజరి మేరి, నాయకులు వెంకటరావు, శివాజీ, అర్జున్‌, గురుమూర్తి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్‌

ఎంవీపీకాలనీ (విశాఖ): భార్యను హత్యచేసిన ఘటనలో భర్త డానియేల్‌ను ఎంవీపీ పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఈ మేరకు ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడకు చెందిన డానియేల్‌, సీలేరుకు చెందిన సలోమి (28) 2018లో ప్రేమ వివాహం చేసుకున్నారు. విశాఖలోని నక్కవానిపాలెం శివాలయం వీధిలో ఉంటున్నారు. డానియేల్‌ ఎండాడలోని ఓ చర్చిలో పనిచేస్తుండగా సలోమి నగరంలోని ఓ హోటల్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు(కవలలు) ఉన్నారు.

భార్యపై డానియేల్‌కు అనుమానం ఉండటంతో ఇరువురి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగగా క్షణికావేశంలో డానియేల్‌ ఆమెను కొట్టడంతో పాటు చున్నితో ఫ్యాన్‌కు ఉరివేసి హత్యచేశాడు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి రావడంతో డానియేల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అతని సెల్‌ ఫోన్‌ సిగ్నల్‌ ఆధారంగా అతడ్ని అరెస్ట్‌ చేసినట్లు పోలీసులు తెలిపారు.